క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రకృతి చికిత్సాలయంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

మహారాణిపేట: ప్రధాని మోదీ విశాఖలో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనడం ఆనందదాయకమని మహారాణిపేటలో గల ప్రకృతి చికిత్సాలయం యోగా శిక్షకురాలు శిష్టా శ్రీలక్ష్మి అన్నారు. యోగాతో మానవుని జీవన ప్రమాణం పెరుగుతుందని, మానసిక రుగ్మతలు అరికట్టవచ్చని, ఒత్తిడి తగ్గుతుందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే యోగా చేస్తే జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. మన సంస్కృతిలో భాగమైన యోగాను ప్రపంచానికి అందించడం గర్వకారణమన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విలువలతో కూడిన విద్య అందించాలి



హెచ్‌ఎం కృష్ణవేణిని అభినందిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

బీచ్‌రోడ్డు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్ సూచించారు. నౌకానగర్ ప్రాథమిక పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయిని కృష్ణవేణిని గురువారం ఆమె కలిసి అభినందించారు. విద్యార్థులకు చక్కని విద్యాబుద్ధులు నేర్పించి పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని కార్పొరేటర్ కోరారు. తమ నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అవసరమైన అందిస్తామని హామీ ఇచ్చారు.

పేదలందరికీ పథకాలు వర్తింపజేయాలి

మద్దిలపాలెం: కొన్ని వర్గాల పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా ఉన్నాయని బీజేపీ నేత మూలా వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల కారణంగా కొంతమంది పేదలకు పథకాలు అందడం లేదని, దీనిపై సీఎం, డిప్యూటీ సీఎంలు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీ, విద్యుత్ సబ్సిడీ పథకాలకు కొన్ని వర్గాల పేదలు అర్హులు కాకుండా పోయారన్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందిన ఆప్కాస్ కార్మికులకు కేవలం రూ.15,000 జీతం మాత్రమే వస్తోందని, అటువంటి వారు సంక్షేమ పథకాలకు అర్హులు కాకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.25 వేల కంటే తక్కువ ఆదాయం వచ్చే అన్ని కుటుంబాలను పథకాలకు అర్హులను చేయాలని, ఈ మేరకు నిబంధనలు సడలించాలని సూచించారు.

రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథయాత్రలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తన సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు జగన్నాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అపారిశుధ్యంతో.. అవస్థలు

- జీవీఎంసీ 35వ వార్డులో క్షీణిస్తున్న పారిశుధ్యం
- దోమలతో ప్రజలు సతమతం
- వ్యాధుల సీజన్ కావడంతో బెంబేలు
- పట్టించుకోని అధికారులు



ఆర్‌ఆర్‌ఎం రోడ్డులో రహదారి మధ్యలో గల గోతిలో చేరిన మురుగు నీరు



దోమలకు ఆవాసంగా మారుతున్న మంచాల వీధిలో తవ్వి వదిలేసిన కాలువ



టౌన్ కొత్తరోడ్డు వద్ద కల్వర్ట్ నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన మట్టి

జగదాంబ: పారిశుధ్యం క్షీణించడంతో 35వ వార్డు ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అసలే సీజనల్ వ్యాధుల కాలం కావడంతో అనారోగ్యాలకు గురవుతామేమో అని భయపడుతున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య కార్మికులు వార్డులోని ప్రాంతాలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

మురుగుతో ఇబ్బందులు..

బౌడారా రోడ్డు, నూనె మిల్లువీధి ప్రాంతాల్లోని డస్ట్‌బిన్ల వద్ద మురుగు చేరి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ చెత్త తీస్తున్నారు తప్ప మురుగు శుభ్రం చేయకపోవడంతో దోమలు ప్రబలుతున్నాయి. అదే విధంగా ఇటీవల తాగునీటి పైపుల ఏర్పాటు కోసం మంచాలవీధి నుంచి పండావీధి వరకు తవ్వి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఆ గోతుల్లో మురుగు నీరు చేరి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

టౌన్ కొత్తరోడ్డు, ఆర్‌ఆర్‌ఎం రోడ్డులో..

పారిశుధ్య పరిరక్షణ, చెత్త సమస్యపై అవగాహన కోసం ఈ ప్రాంతాలకు వచ్చే అధికారులు పూర్ణా మార్కెట్, రామకృష్ణా రైతు మార్కెట్, జనతాబజార్ వంటి చోట్లకే వెళ్తున్నారు తప్ప ఆ ప్రాంతాల వెనుక ఉన్న టౌన్ కొత్తరోడ్డు, ఆర్‌ఆర్‌ఎం రోడ్డు వంటి ప్రాంతాలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల అపారిశుధ్య సమస్య అలాగే ఉండిపోతుందని చెబుతున్నారు. నెలలు కావస్తున్నా కల్వర్ట్ నిర్మాణం కోసం తవ్విన మట్టిని ఇప్పటికీ తొలగించకపోవడమే దీనికి ఉదాహరణ అంటున్నారు. అలాగే ఆర్‌ఆర్‌ఎం రోడ్డుపై ఏర్పడిన గొయ్యి ఒక పక్క ప్రమాదాలకు కారణం అవుతుంటే మరోపక్క వర్షం నీరు, చెత్తా చెదారం చేరి దోమలకు ఆవాసంగా మారింది.

దోమలతో ఇబ్బంది పడుతున్నాం..

పారిశుధ్య కార్మికులు వచ్చి చెత్త తీస్తున్నారు. మురుగు పోవడానికి చర్యలు తీసుకోవడంలేదు. దీని వల్ల దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. దుకాణాలు, సమీపంలో ఉన్న ఇళ్లలో ఉండలేకపోతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని మురుగు తొలగించాలి.

– నర్సింగరావు, కల్లుపాకలు, జీవీఎంసీ 35వ వార్డు

గోతులు పూడ్చి పరిశుభ్రం చేయాలి..

మంచాల వీధి, టౌన్ కొత్తరోడ్డు, ఆర్‌ఆర్‌ఎం రోడ్డులో తవ్వినవి, వాటంతటవే ఏర్పడిన గోతులను వెంటనే పూడ్చాలి. లేకపోతే దుర్వాసన భరించలేకపోతున్నాం. వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఫ్రైడే డ్రైడే పాటించాలని చెబుతున్నారు కానీ అపరిశుభ్రాన్ని తొలగించలేకపోతున్నారు.

– రాజు, ఆర్‌ఆర్‌ఎంరోడ్డు, జీవీఎంసీ 35వ వార్డు

మర్యాదపూర్వక కలయిక



వాసుపల్లిని సత్కరిస్తున్న బొడ్డేటి ప్రసాద్

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట నాయకుడు బొడ్డేటి ప్రసాద్, కార్యకర్తలు గురువారం ఆశీలమెట్ట కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. 33వ వార్డులో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ



యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది తదితరులు

అల్లిపురం: ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 33వ వార్డు ప్రజలకు అవగాహన కల్పించేందుకు గౌరీవీధి సచివాలయం ఆధ్వర్యంలో బుధవారం అవగాహనా ర్యాలీ చేపట్టారు. సచివాలయ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో గౌరీవీధి, వెంకటేశ్వరమెట్ట, గోవింద్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లికి వార్డు అధ్యక్షుల సత్కారం



వాసుపల్లిని, ఆకుల యేసును, జానకీరామ్‌ను సత్కరిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను నూతనంగా నియమితులైన వార్డు అధ్యక్షులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, 31వ వార్డు అధ్యుడు దొడ్డి బాపూ ఆనంద్, 32వ వార్డు అధ్యక్షుడు రాజారెడ్డి, 34వ వార్డు కార్పొరేటర్, ఆ వార్డు అధ్యక్షురాలు తోట పద్మావతి, 36వ వార్డు అధ్యక్షుడు మహ్మద్ షకీల్, 37వ వార్డు అధ్యక్షుడు ఆకుల యేసు, ఆ వార్డు కార్పొరేటర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నా జానకీరామ్, 38వ వార్డు అధ్యక్షుడు గురజాపు రవి, సౌత్ గ్రీవెన్స్ అధ్యక్షుడు మళ్ల బుజ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కష్టపడి పని చేసే వారికి జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పేదలకు మళ్లీ రామరాజ్యం అందించడానికి ఐక్యంగా కష్టపడాలని పిలుపునిచ్చారు.

‘తిలాదానం’ చిత్రంపై చర్చ



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో వారాంతపు ఉత్తమ చిత్రాల ప్రదర్శనలో భాగంగా గురువారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 2003 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన ‘తిలాదానం’ తెలుగు సినిమాను ప్రదర్శించారు. 90 నిమిషాల నిడివి గల చిత్ర ప్రదర్శన అనంతరం చర్చా కార్యక్రమం జరిగింది. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు సంధానకర్తగా వ్యవహరించి చర్చ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వర్గీయ కె.టి.ఎస్.శాస్త్రి దర్శకత్వంలో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ చిత్రం నిర్మించిందన్నారు. బ్రాహ్మణిక సనాతన సాంప్రదాయానికి, సమ సమాజ స్థాపనకు మధ్య జరిగే సంఘర్షణే కథాంశమన్నారు. ఈ చిత్రం నిర్మించి 22 ఏళ్లు అయినా విడుదలకు నోచుకోలేదని, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన చిత్రమని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర కళాకారుల వెల్ఫేర్ సంఘం అధ్యక్షురాలు ఇందిరా ప్రియదర్శిని, కార్యదర్శి బొట్టా నాగేశ్వరరావును ఫిల్మ్ సొసైటీ తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యతో పిల్లలకు బంగారు భవిత



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులతో సీడీపీవో నీలిమ, సిబ్బంది

మర్రిపాలెం: అంగన్‌వాడీ విద్య చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాట అని అర్బన్ సీడీపీవో నీలిమ అన్నారు. 53వ వార్డు ఆంధ్రకేసరి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆటపాటలతో కూడిన విద్యాబోధనలో ఆరోగ్యం, పౌష్టికాహారం ఉంటుందన్న విషయాన్ని పిల్లల తల్లులకు వివరించారు. వార్డు మాజీ కార్పొరేటర్ పాలమరశెట్టి నర్సకుమారి సీడీపీవోతో కలిసి చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. నాలుగేళ్లు పూర్తయిన పిల్లలందరికీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమాన్ని సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి పర్యవేక్షించారు. ప్రథమ టీం విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్ లాల్, మహిళా సంరక్షణ కార్యదర్శులు భవాని, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధకం చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పరవాడ సిన్స్ ఫార్మస్యూటికల్స్ ప్రైవేటు లిమిటెడ్ సిబ్బందికి వర్చువల్ విధానంలో పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు చట్టంలో పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది జె.వీరలక్ష్మి చట్టాల్లో వివిధ సెక్షన్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సీవోటీ జాయింట్ సెక్రటరీకి సత్కారం

మర్రిపాలెం: సీవోటీ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన ఆర్.కనకారావును జోనల్ అధ్యక్షుడు ఆర్.వి.ఎస్.ఎస్. రావు, డివిజనల్ కో ఆర్డినేటర్ పి.ఆర్.ఎం.రావు, సీవోటీ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జోనల్ అధ్యక్షుడు మాట్లాడుతూ సౌమ్యుడు, స్నేహశీలి అయిన కనకారావు సీవోటీ జాయింట్ సెక్రటరీగా ఎన్నికవడం గర్వకారణమన్నారు. కనకారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల కృషికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరాలయ వార్షికోత్సవం



వెంకన్నను దర్శించుకుంటున్న మాజీ మేయర్ హరివెంకటకుమారి దంపతులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు భరత్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భరత్‌నగర్, టీఐసీ పాయింట్, డ్రైవర్స్ కాలనీ, శ్రీహరినగర్ తదితర కాలనీల నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ దంపతులు కూడా వెంకన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఈపీడీసీఎల్ తప్పిదంతో ‘తల్లికి వందనం’ కట్

- లబ్ధిదారు ఆధార్ కార్డునే విద్యుత్ కనెక్షన్ కోసం వాడుకుంటున్న పలువురు



ఒకే ఆధార్ నంబరుతో ఏడు కుటుంబాలు విద్యుత్ కనెక్షన్‌ను ఉపయోగిస్తున్నట్లున్న జాబితా



మనవడిని పట్టుకుని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్న పెద్దాయన

డాబాగార్డెన్స్: తండ్రి మద్యానికి బానిసయ్యాడు. తల్లి అనారోగ్యంతో మంచం పట్టింది. భార్యాభర్తలిద్దరూ పదేళ్ల కిందట విడిపోయారు. ఇద్దరు పిల్లలు తల్లి చెంతే పెరిగారు. తల్లి ఓ ప్రైవేట్ దుకాణంలో పని చేస్తోంది. కూతురు పడుతున్న కష్టం చూసి తండ్రి తన ఇంటికి తెచ్చుకున్నారు. పిల్లలిద్దరూ నగరంలోని జీవీఎంసీ పాఠశాలలో చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనం పథకం డబ్బులు తల్లి ఖాతాలో జమ కాలేదు. ఈ విషయమై ఆమె సమీప సచివాలయానికి వెళ్లి గోడు వెళ్లబోసుకుంది. సచివాలయ సిబ్బంది ఆమె ఆధార్ నంబర్‌తో డేటా వెరిఫై చేశారు. ఆమె ఆధార్ నంబర్‌తో ఏడుగురు విద్యుత్ వాడుకుంటున్నట్టు తేలింది. ఇంతలోనే ఆమె అనారోగ్య కారణంగా మంచం పట్టింది. సచివాలయాల చుట్టూ తిరిగే బాధ్యతను ఆమె తండ్రి తీసుకున్నారు. ఎక్కడికి వెళ్లాలో? ఏ సచివాలయానికి వెళ్లాలో తెలియక లబోదిబోమంటున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. కొత్త సాలిపేటకు చెందిన ఏలూరి నవనీత ప్రియకు 15 ఏళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు కుమారులు. భర్త మద్యానికి బానిసై కుటుంబాన్ని సరిగ్గా చూసుకోకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తోడై కూతురు పడుతున్న కష్టం చూసి తండ్రి కుమార్తెను తన ఇంటికి తీసుకొచ్చారు. ఆమెకు ఎటువంటి ఆస్తుల్లేవ్. రెక్కాడితే గాని డొక్కాడదు. కడు పేదరికంలో ఉన్నా ఆమెకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఏవీ అందడం లేదు.

ఏపీఈపీడీసీఎల్ లీలలు..

నవనీత ప్రియ పిల్లలిద్దరూ జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాలలో చదువుకుంటున్నారు. తోటి పిల్లలకు తల్లికి వందనం పేరిట రూ.13 వేలు జమయ్యాయి. నవనీత ప్రియ అకౌంట్లో మాత్రం డబ్బులు పడలేదు. దీంతో ఆమె సమీప సచివాలయానికి వెళ్లి ఆరా తీశారు. ఆమె ఆధార్ నంబర్‌తో ఏడుగురి పేర్లు నమోదై ఉన్నాయి. దీంతో ఆమె ఖంగుతింది. గాజువాక శ్రీనగర్.. ఆటోనగర్‌కు చెందిన పడాల అన్నపూర్ణ, గురునాథరావు కాలనీకి చెందిన ఎజ్జిపరపు శాంతి, రాంనగర్‌కు చెందిన తెర్రి లక్ష్మి, శ్రీనగర్, జీకేఆర్ టవర్స్–1కి చెందిన గర్రపాటి కోటేశ్వరరావు, సంద్రానిపాలేనికి చెందిన ఎల్.నాగేశ్వరమ్మ, శ్రీరామ్‌నగర్‌కు చెందిన గంటిపల్లి విజయలక్ష్మి, శ్రీ నూకాంబిక దేవాలయ సంక్షేమ సేవా సంఘం ఈమె ఆధార్ నంబర్‌తో లింక్ అయి ఉన్నాయి. దీంతో ఆమె అకౌంట్లో పడాల్సిన తల్లికి వందనం డబ్బులు జమ కాలేదు. దీనిపై ఆమె తండ్రి మాట్లాడుతూ మా కుమార్తె అనారోగ్యంతో మంచం పట్టింది. పిల్లలిద్దర్ని పట్టుకుని ఎక్కడికని తిరగాలి. సచివాలయానికి వెళ్తే.. ముందు ఎవరెవరు మీ పాప ఆధార్ కార్డు వినియోగించి విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారో ఆ ఏరియా సచివాలయాలకు వెళ్లి అక్కడ వారి పేరు కట్ చేయించాలి. ఆ పేర్లు డిలీట్ చేస్తేనే మీ పాప అకౌంట్లో డబ్బులు పడతాయని చెప్పారంటూ నవనీత తండ్రి సాక్షి వద్ద వాపోయారు. విద్యుత్ శాఖ అధికారులు తమ మొర విని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

మానసిక రోగులకు శానిటరీ ప్యాడ్స్ వితరణ



ఆశ్రమవాసులకు శానిటరీ పాడ్‌లు అందజేస్తున్న వైజాగ్ ఆల్ఫా లేడీస్ సర్కిల్ ప్రతినిధులు

అల్లిపురం: టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ డే–నైట్ షెల్టర్లలో ఆశ్రయం పొందుతున్న 85 మంది మానసిక మహిళా రోగులకు వైజాగ్ ఆల్ఫా లేడీస్ సర్కిల్ 174 సంస్థ రీ యూజబుల్ శానిటరీ ప్యాడ్స్ అందజేసింది. గురువారం సంస్థ చైర్‌పర్సన్ ఖుష్బూ, నీలిమ షెల్టర్‌కు వచ్చి శానిటరీ ప్యాడ్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి పాల్గొన్నారు. దాతలకు వారు ధన్యవాదాలు తెలిపారు.

పార్టీ నూతన అధ్యక్షులకు అభినందనలు



తోట పద్మావతికి అభినందనలు తెలియజేస్తున్న లండా రమణ తదితరులు



కనకరెడ్డిని సత్కరిస్తున్న ఆదివిష్ణురెడ్డి, సువార్తరాజు తదితరులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ 34వ వార్డు అధ్యక్షురాలిగా వార్డు కార్పొరేటర్ తోట పద్మావతిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం చైర్మన్ లండా రమణ, జిల్లా వాలంటీర్ విభాగం ఉపాధ్యక్షుడు దూడ అప్పారావు, రీసు అనురాధ తదితరులు ఆమెను అభినందించి, సత్కరించారు. అదే విధంగా జిల్లా వాలంటీర్ విభాగం ఉపాధ్యక్షుడిగా నియమితులైన దూడ అప్పారావుకు అభినందనలు తెలిపారు.

అలపన కనకరెడ్డికి సత్కారం..

వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడిగా మరోసారి నియమితులైన అలపన కనకరెడ్డిని పార్టీ నగర కార్యదర్శి అబ్బిరెడ్డి ఆదివిష్ణు రెడ్డి, నియోజకవర్గం క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువార్తరాజు గురువారం గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు జీరు సూర్యనారాయణ, సౌత్ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మల్ల బుజ్జి, ఎర్నిమాంబ దేవస్థానం చైర్మన్ లండా రమణ, కర్రి రాము, బత్తుల రాము, గంగాధర్, కనకమ్మ, యాళ్ల రవణమ్మ, సిమ్మ పుష్ప, అలపన నారాయణమ్మ, పోలవరపు రమణమ్మ, రంగాల రవికుమార్, నాగిరెడ్డి, కుమార్, వినోద్, నగేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాంబశివరావుకు ఐసీఎస్ఎస్ఆర్ సీనియర్ ఫెలోషిప్



ఆచార్య సాంబశివరావును సత్కరిస్తున్న ఆచార్య సుదర్శనరావు తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఆచార్యులు ఎస్.సాంబశివరావు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్)లో సీనియర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్(ఐఐపీఏ) విశాఖ ప్రాంతీయ కేంద్రం సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. ఐఐపీఏ విశాఖ కేంద్రం చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావు మాట్లాడుతూ విశాఖలో ఉద్యోగుల జీవన నాణ్యతపై ఉద్యోగుల సంక్షేమ పద్ధతుల ప్రభావం అనే అంశంలో పరిశోధనకు సాంబశివరావు ఎంపికయ్యారని తెలిపారు. కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం నుంచి 2024–26 సంవత్సరానికి ఈయన ఒక్కరే ఎంపికవడం విశేషమన్నారు. ఐఐపీఏ కార్యదర్శి ఆచార్య పీటీటి ప్రేమానందం మాట్లాడుతూ ఇలాంటి ఫెలోషిప్‌లకు ఏయూ ఆచార్యులు ఎంపికవడం వర్సిటీకి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపును తెస్తుందన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్ ఔషధంపై పేటెంట్



పరిశోధనా బృంద సభ్యులను అభినందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ బి.కిషోర్ బాబు, పరిశోధనా బృందం అప్పారావు, స్వర్ణలత, వీర్రాజు, గోపి, ఫణి ఒక గొప్ప విజయం సాధించారు. బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్సకు అభివృద్ధి చేసిన నూతన నాప్తాలిమైడ్ డెరివేటివ్ సమ్మేళనానికి భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం 20 ఏళ్ల కాలానికి పేటెంట్ మంజూరు చేసింది. ఈ సమ్మేళనం నిర్దిష్టమైన బ్రెస్ట్ క్యాన్సర్ కణాలపై మెరుగైన ప్రభావాన్ని చూపడం, తక్కువ దుష్ప్రభావాలు కలిగి ఉండటంతోపాటు డ్రగ్–రెసిస్టెంట్ కణాలను లక్ష్యంగా చేసుకునే ప్రత్యేకమైన పని విధానాన్ని కలిగి ఉండటం వంటి అనేక ప్రయోజనాలను కలిగి ఉందని పరిశోధనా బృంద సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఈ బృందాన్ని ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ కిషోర్‌బాబు అభినందించారు. ఈ ప్రయోగాత్మక విజయం యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకురానుందని వారు పేర్కొన్నారు.